International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.4, Issue-12(2), December, 2017
Impact Factor: 6.023; Email: drtvramana@yahoo.co.in

# మ్యూజింగ్స్‌లో మనిషితత్వం

డా.చింతం ప్రవీణ్ కుమార్
పోస్ట్ డాక్టోరల్ ఫెలో
కాకతీయ విశ్వవిద్యాలయం.

చలం సాహిత్యంలో బహిర్ముఖంగా కనిపించే అతి ప్రధానమైన అంశం స్త్రీ విముక్తికై తపన...స్త్రీ స్వేచ్ఛ కోసం ఆరాటం. స్త్రీ పురుషుల సంబంధాలు నిజమైన ప్రేమ భావన ప్రాతిపదికగా రూపొందించబడాలని ఆకాంక్షించిన ఆయన స్వేచ్ఛాయుత మనిషికోసం, అచ్చమైన మనిషితనం కోసం నిత్యం ఆరాటపడ్డాడు..ఆ ఆరాటాన్ని మ్యూజింగ్స్‌లో అక్షరబద్ధం చేసాడు. సమాజంలో చోటు చేసుకున్న కపటత్వం,నీచత్వం,స్వార్థం,సంకుచితత్వాలను చీల్చి చెండాడడానికి ఆయన తన అక్షరాలనే ఆయుధాలుగా మలిచి తన మ్యూజింగ్స్ నిండా ఒక యుద్ధమే చేసాడు. ఇందులోను భాషా పాటవం,సృజనాత్మకత,శైలి,పటుత్వం,వాక్య నిర్మాణం,వే ఆఫ్ ఎక్స్‌ప్రెషన్ అన్నింటికన్నీ మ్యూజింగ్స్‌కు విశేషమైన ఆకర్షణతో ఉండి అన్ని కాలాల పాఠకుల్ని చదివించేలా చేసాయి. వాస్తవానికి చలం మ్యూజింగ్స్ ఆ కాలానికి ఈ కాలానికి అంటూ కాలాలకు ముడిపెట్టలేని ఒక కాలాతీత తత్వం. అది అన్ని కాలాలను తనతో వెంట తీసుకుపోగలిగే మహత్తర అక్షర యజ్ఞం. చాలా మట్టుకు సాహిత్యం ఒక నియమిత కాలాన్ని, నియమిత సందర్భాన్ని,నియమిత విషయాన్ని,నియమిత వస్తువును నమోదు చేసే విధంగానే ఉండడం చూస్తాం కానీ మ్యూజింగ్స్ వేరు. మ్యూజింగ్స్‌లోని సాహిత్యం ఫలానా కాలానికి, ఫలానా సందర్భానికి, ఫలానా విషయానికి సంబంధించిందని తేల్చిపారేయడమం సాధ్యం కాని పని.

కాలానికి,వస్తువుకు అతీతమైన భావనలు చలం మ్యూజింగ్స్‌లో అడుగడుగునా కనబడతాయ్...అయితే మ్యూజింగ్స్‌లో ఆయన వస్తువు మాత్రం స్వేచ్ఛాయుతమైన మానవుడే. ఆయన కంటే ముందు కాలం,ఆ తర్వాత ఆయన జీవించిన కాలం..,అప్పటి నుండి నేటి గ్లోబలైజ్డ్ కాలం వరకు ఆ కాలం ఈ కాలం అంటూ తేడా లేకుండా ఏ కాలంలోనైనా సూటిగా మనిషిని మనిషిగా నిలబెట్టే మ్యాజిక్ పదాల సమ్మేళనం మ్యూజింగ్స్. నరాల బరువును తీర్చి మెదడు బరువును పెంచే ఫిలాసఫికల్ థాట్ ప్రోవోక్ మ్యూజింగ్స్. ప్రస్తుత గ్లోబలైజ్డ్ దునియాలో మనిషిని మనిషిగా చూడలేని సొసైటీనీ, మరీ ముఖ్యంగా ఎవరికి వారు తమకు తాము మాది సివిలైజ్డ్ సొసైటీ అని ఫోజుకొడుతూ ప్రవర్తనాపరంగా అట్టే అన్ సివిలైజ్డ్ సొసైటీకి సంకేతంగా నిలుస్తున్న వాళ్ళ బుద్ధికి కఱ్ఱు కాల్చి పెట్టిన వాత మ్యూజింగ్స్. నాగరికత అనే ముసుగు నటిస్తూ మనుష్యులు ప్రవర్తిస్తున్న అనాగరిక జీవితాలను చలం ఒప్పుకోడు...అలాగని ప్రతీ తంతు హేతువుకు నిలబడలేదనీ కార్యాకారణ సంబంధం లేకుండానే చాలా జరుగుతాయని దాన్ని సైన్సో మరోటో పట్టలేదని తేల్చిపారేస్తాడు చలం.

మనిషి జీవితంలో భావనలకు అమితమైన ప్రాధాన్యతనిచ్చే చలం మనిషిలో ఆ మనిషితో ఉన్న సమాజం ఆ సమాజపు గతి తాలూకూ ప్రతి విషయాన్ని ఆయన తనదైన ముద్రతో చెప్పగలిగారు. అంతేగాకుండా మనిషిలోని ఇడ్,ఈగో,సూపర్ ఈగోలకు తాత్వికమైన అక్షరాయుధాల్నిచ్చాడు చలం. ముఖ్యంగా చలం సాహిత్యంలోకెల్లా బ్రాండ్ మార్క్‌గా నిలిచే మ్యూజింగ్స్‌లో మనిషిలోని ఈవిల్‌ని అక్షరాక్షరం పట్టిచ్చాడు చలం. మనిషిలోని చీడ..,చింత.., వెంపర్లాట..,వేగిరతనం..,మోహం..,దాహం..,భయం..,జాలి..,కన్నీళ్ళు..,విచికిత్స ..,అన్నింటికన్నింటినీ ఎక్స్‌రే తీసి అక్షరాలు తొడిగాడు చలం. ఎన్ని చెప్పినా అంతిమంగా మనిషితనం ముఖ్యమని ఈ కులాలు,మతాలు,జెండర్ తేడాలు లేని స్వేచ్ఛాయుత సమాజం కావాలని బాహిర్ సమాజం కన్నా సమాజం ఎవరిచేతైతే నింపబడి ఉందో వాళ్ళు ముఖ్యమని అంతర్ సమాజం ముఖ్యమని ఆ సమాజంలో నివసిస్తున్న వాళ్ళందరి స్వేచ్ఛ కోసం అక్షర తపస్సు చేశారాయన. సాటి మనిష్యులు తనను ద్వేషించినా సరే మనిషిని మనిషిగా ప్రేమించాలనేదే తన ధృడమైన వాంఛ అని తన అంతర్లీనతని ప్రకటించేశారు.

"లోకం తనని ద్వేషించేటంత లోకం మీద ప్రేమ ఉంటేనే కాని ఔన్నత్యం లేదు మనిషికి. అంతకన్నా ఉన్నతమైన ప్రేమగల మనుష్యుల్ని లోకం గుర్తే పట్టద"ంటారు మ్యూజింగ్స్‌లో ఒక చోట. ఈ వాక్యాలు చలం జీవితాన్ని అతని అక్షరాలను అక్షరాలా పట్టిస్తాయి.

మ్యూజింగ్స్ వల్ల సంఘ జ్ఞానం పొందడానికి మనస్సు అటో ఇటో కాస్త నిరాకరించినా ఆత్మ జ్ఞానం పొందడం ఖాయం. అయితే మనం ఏం పొందుతామో స్పష్టంగా ఇదీ అని చెప్పకపోయినప్పటికీ....ఏం కోల్పోయామో స్పష్టంగా భోదిస్తుందీ మ్యూజింగ్స్. కట్టుబాట్ల సమాజంలో విచ్ఛిన్నవుతున్న మనిషిని వాడిలోని మనిషితనాన్ని సున్నితంగా గాడీలో పెట్టే ప్రయత్నం చేస్తూనే మనిషి అంతర్లీనంగా ఏండ్లకేండ్లుగా నాటుకుని ఉన్న చీడను మాత్రం చీల్చి చెండాడుతాడు మ్యూజింగ్స్‌లో. మొత్తంగా మనిషి మనిషిగా బతకడానికి సంఘం ఏర్పర్చిన నియమాలు, ఎదుటివాళ్ళకు మాత్రమే చెప్పే నీతులను చలం ఖండఖండాలుగా ఖండించాడు. సంఘం చెప్పే నీతులు నియమాల నిచ్చెన మెట్లలో

మనిషి బందీఖానా అయినాడని మొత్తంగా స్వేచ్ఛా రాహిత్యపు బతుకులను,స్వేచ్ఛా రాహిత్యపు మనుష్యులను,వారికి అంటకాగే వాళ్ళను అందరిని చలం ఈసడించుకున్నాడు. తన సాహిత్యం మనిషిని మనిషిగా ఉంచడటానికి ఏ మాత్రం ఉపయెగపడ్డా తన సాహిత్యసృజనకు ప్రయోజనం చేకూరినట్టేనని భావించాడు చలం.

మనిషి అనేవాడు బతకడానికి సూత్రాలు ఫార్ములాలు సిద్ధాంతాల కన్నా స్వేచ్ఛాయుత వాతావరణం ముఖ్యమని ఆయన గాఢంగా నమ్మాడు. ఏదో ఒక చట్రాన్ని సృష్టించి ఆ చట్రంలో మనిషిని నిర్బంధించడమే నిజమైన దోషమని చెబుతాడు. ప్రతీ ఒక మనిషికి వారివారి వ్యక్తిగతమైన ఆలోచనా విధానం,నడవడి, జీవన వ్యవహారాలుంటాయని అవి ఏదో ఒక కృత్రిమైన చట్రంలో ఇమడవని తేల్చిపారేస్తాడు చలం. అయితే మ్యూజింగ్స్‌లోని ఆయన భావనలు ఆయనతోనే చాలా చోట్ల సంఘర్షించుకున్నట్లు స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ పుట్టుక నుండి చావు వరకు..,మనిషి నుండి సంఘం వరకు ఈ మధ్యలో ఉన్న వ్యక్తిగత జీవితాన్ని సంఘ జీవితాన్ని చలం అత్యంత తాత్వికమైన ధోరణిలో చెప్పారు. ఈ విషయంలో ఆయన మీద రమణమహర్షి ప్రభావం ఉన్నట్లు స్పష్టంగా కనబడుతుంది.

"ఈనాడు నువ్వూ నేనూ బోధించే సంస్కారాలు,చాలా సత్యమూ,అవసరమూ కావొచ్చు.కాని మనవంటి వారు వెయ్యి  మంది అరుస్తున్నారు. సంఘం చెవిలో చుట్టూ చేరి ప్రతీవాడి మాటా విని అటూ ఇటూ కదిలితే,బజారులో అమ్మే ప్రతీ మందూ కొని తాగే రోగి స్థితి పడుతుంది సంఘానికి. అందుకనే ఎవరెంత లాలించనీ,తిట్టనీ,దెబ్బలు తినే దున్నపోతు వలె సంఘం స్థిరంగా ఆలోచిస్తుంది.కదులుతుంది ఎప్పటికో.ఈ లోపల కంఠం చించుకో,కొట్టూ,బతిమాలు,చావు. అట్లా కదలక ఆలోచిస్తుంది. మనం చేప్పేవన్నీ క్రమంగా మెల్లిగా లోపలికి తీసుకుని ఎక్కడో ఆలోచించుకుంటుంది.కాని కదులుతుంది.ఎప్పటికో తనకి నచ్చినప్పుడు కదులుతుంది.మనం ఇట్లా గోల పెడితేనేగానీ కదలదు. ఈ దున్నపోతును తోలడానికి మనిషి కావాలి. గట్టిగా ఊపే సత్తువ గల మనుషులు కావాలి. తన్నులు తిని కూడా పట్టు వదలని ధీరులు కావాలి. తమ సత్యంలో తమకి విడవని విశ్వాసం ఉన్న ప్రవక్త కావాలి." అంటారు ఒక చోట చలం..,ఐతే తమ సత్యంలో తమకి విడవని విశ్వాసం ఉన్న ఆ ప్రవక్త ఎవరో కాదు. చలమే.

ఏ మనుష్యుల్ని,ఏ సంఘాన్నిగాని,జాతుల్ని గాని,సుఖంగా నిద్రపోయే వారిని,శాంతిలో ఉన్న వారిని,జ్ఞానం పేర,స్వతంత్రం పేర,హక్కుల పేర,నిద్రలేపడం పాపమంటారు చలం. అశాంతి వాళ్ళలో ఉదయించినప్పుడు,వాళ్ళు మేల్కొని,కాంతి కోసం దోవ తడుముకుంటున్నప్పుడు తోవ చూపడం,బాగా కళ్ళు తెరవడం చెయ్యడమే దయాపరుల ధర్మం' అంటారాయన. శాంతిలో నిద్రపోయే ప్రజల్ని–విద్య పేర,స్వేచ్ఛ పేర,మతం పేర.జ్ఞానం పేర,అభివృద్ధిలోకి,అశాంతిలోకి లాగడం ఘోర కార్యమనిపిస్తుందంటారు. అభిరుచుల్లోనే కాదు,ధర్మం,అధర్మం,నీతి,అవినీతి అనే పదాల్లో కూడా,దేవుడూ,శాస్త్రం,పాపం,ఇట్లాంటి అధికారాలు తీసేస్తే ఎవరి మనసుకి తోచింది అదే కాని ఒకదాంట్లో నిజం ఉందని ఎవరూ రూఢీగా మాట్లాడలేరంటాడు చలం తన మ్యూజింగ్స్‌లో.

తన రాతలు సాటి మనిషికి చెప్పే నీతులు కావని ఇదంతా తన సొంత బాధ అని అతి సాధారణంగా చెప్పాడు చలం.  ఏ ప్రయత్నాలు త్యాగాల విలువలు కొలవాలన్నా మనిషిలో కలిగే శాంతి,కాంతి,దయ,ఇవే కొలతలనీ, ఎంత గొప్ప ఉద్యమం సాధించనీ,ఏ వ్యవస్థలు స్థాపించనీ,వ్యక్తి అభివృద్ధి లేనిదీ ఏదీ నిలవదంటారాయన. ఒకవేళ నిలవమని పట్టి నిలిపినా ఏ శాంతినీ ఇవ్వదనీ మనిషి ఏం చేశాడు అని కాదు,మనిషి ఏ విధంగా ఎలా తయారైనాడు అనేది ఒక్కటే విలువ'ని సూత్రీకరిస్తాడు చలం. ఎంత చెప్పినా మనిషి వాడి నిత్యమూ అలవాటైన దారిని వీడడం అంత సులువు కాదని అన్నింటికి పరిష్కారం మనిషికి స్వేచ్ఛనివ్వడమేనని ఆ స్వేచ్ఛాయుత జీవితంలోనే మనిషి తనను తాను తెలుసుకుంటాడని చెబుతాడు మ్యూజింగ్స్ అంతటా. కట్టుబాట్లు నియమాల కంటే సగటు మనిషి తన వ్యక్తిగత భావనలకు ఎక్కువ విలువనిస్తాడని కనుక అతని భావనలకు విలువనివ్వనిదే సమాజ మార్పును ఆశించడం వృధా ప్రయాసేనని అక్షరాక్షరమూ ఒత్తి పలికాడు చలం తన మ్యూజింగ్స్‌లో.

ఉపయుక్త గ్రంథాలు:

1. వెంకటాచలం,గుడిపాటి,'మ్యూజింగ్స్'. ప్రియదర్శిని ప్రచురణలు,.హైదరాబాద్,2011.

2. ఆరుద్ర,తెలకపల్లి రవి,'చలం జీవిత సాహిత్యాలు',ప్రజాశక్తి బుక్ హౌజ్, హైదరాబాద్,మార్చి, 2009.

3. మన చలం